
# పుస్తక పరిచయం




**మూడు సంవత్సరాల పాటు** కౌముది పాఠకులని అలరించిన `అగ్రహారం కథలు` ఇప్పుడు పుస్తకరూపంలో వెలువడ్డాయి. కన్నతల్లి మీద ఎంత ప్రేమ ఉంటుందో సొంతవూరు మీద అంత మమకారం ఉంటుందనేది నిత్యజీవిత సత్యం. ఏమాత్రం మరకలు పడని అద్దంలాంటి బాల్యంలో సొంతవూరు కలిగించే అనుభూతులు అనిర్వచనీయమైనవి. అలాంటి అనుభూతుల్ని, అనుభవాల్ని అక్షరాల్లో పొదగడమనేది ఓ కళ. ఎవరికి వారు తమ జ్ఞాపకాల పొదరిళ్ళలో అనుభూతించడం ఒక ఎత్తైతే , ఆ జ్ఞాపకాలు విన్న ప్రతివాళ్ళలో ` ఈ జ్ఞాపకాలు నావే..ఈ మనుషులు నాకూ తెలిసిన వాళ్ళే ` అనే భావం కలిగించడం మరో ఎత్తు.

డా.వేదుల సుభద్రగారి అగ్రహారం కథలు చదువుతుంటే ఇలాంటి భావనే కలుగుతుంది. సుభద్రగారి కథల్లో ఉన్న గొప్పతనం ఏమిటంటే ఎక్కడా సంఘర్షణకానీ, వివాదం కానీ, ప్రతినాయక పాత్రలు కానీ. దుష్ట పాత్రలూ కానీ ఉండవు. అందరూ మంచివారే, అందరివీ మంచిమనసులే, కష్టాల్లో ఒకరినొకరు ఆదుకునేవారే. అసూయా ద్వేషాలూ, మద మాత్సర్యాలూ మచ్చుకైనా కనిపించవు. మంచి తనాన్ని ఎత్తిచూపించాలంటే దుష్టత్వాన్నీ పోలికగా చూపించాలి అన్న సూత్రాన్ని అన్నివేళలా పాటించాల్సిన అవసరం లేదు అని రచయిత్రి అనుభవపూర్వకంగా ఈ కథల ద్వారా నిరూపించారు.

జీవితాల్లో ఆనందాలకి ఎంతో ఐశ్వర్యం, త్యాగలకి గొప్ప సందర్భాలు అవసరం లేదని ఎన్నో సంఘటనల ద్వారా, పాత్రల ద్వారా చెబుతారు రచయిత్రి. అమాయకత్వమే ఆనందం, ఉన్నది పంచుకోగలగడమే త్యాగం అని ఈ కథలు చెబుతాయి. " నీ బలహీనత నాది, నా బలం నీది" అని చెప్పే `అరుగుమీది సత్యం గారు` ; "మిషన్ తిరిగిందంటే రైలు చక్రం తిరిగినట్టే" అని ఫేషన్ ప్రపంచం తన వృత్తిని మింగేస్తున్నా దాన్నే అంటి పెట్టుకుని ఉన్న `మిషన్ సూరన్న` ; అలవాటులేని పని చేసి నిజాయితీ పరిధిని దాటి గుండెనొప్పి తెచ్చుకున్న `కంసాలి నాగలింగం` ; ఇదుగో అదుగో అనడమే తప్ప కన్నవారిల్లు విడిచి వెళ్ళలేని `పెద్దావిడ` ; నిచ్చెన వేసుకుని గడ్డిమేటు ఎక్కి కూర్చుని, మామిడికాయలూ, చెరుకుముక్కలూ తింటూ మంచి పుస్తకం చదువుకోవాలనే చిన్ని కోరికని ఏళ్ళతరబడి దాచుకున్న యాభై ఏళ్ళ `పద్మావతమ్మగారు`; "ఇంకో ఆరు నెలలు జీవితం ఉంటే భార్యకోసం, పిల్లల ఆనందం కోసమే గడపాలనుకునే `సింహంలాంటి సూర్యంగారు` ; చిట్టితల్లి - పండు మేష్టారు..... - ఒక్కరా ఇద్దరా..ఎంతమంది ఆత్మీయులు, ఎంతమంది బంధువులూ...!! `అగ్రహారం కథలు` పేజీ పేజీకి మనసుని ఆర్ద్రం చేసే పాత్రలూ, సన్నివేశాలూ కనిపిస్తాయి. ఇందులో చాలా కథలు కళ్ళముందు దృశ్యాల్ని చిత్రీకరించినట్లు , మంచి టివి ఎపిసోడ్ చూస్తున్నట్లూ అనిపిస్తాయి. పలచబడి పోతున్న మానవసంబంధాలని, మనసుల మధ్య ఆత్మీయతలని మరొక్కసారి పట్టిచూపించే ఈ అద్భుతమైన కథలు వ్రాసిన డా.వేదుల సుభద్రగారికి హృదయపూర్వక అభినందనలు. ***

*Published by:*
**Vahini Book Trust**
**1-9-286/2/P Vidyanagar**
**Hyderabad – 500 044**

*Copies available at:*
**Navodaya Book House**
**and all other leading book stores.**




**తెలుగుసాహిత్యంలో సీరియస్ కథలు,** వాస్తవచిత్రణకి పెద్దపీట వేసే కథలు తక్కువగానే వస్తున్నాయని చెప్పుకోవచ్చు. భయంకరమైన వాస్తవాలకి, నగ్న సత్యాలకి, ఆలోచనలని మరిగించే సంఘటనలకి కథారూపమిచ్చే గుండెధైర్యం, కలం బలం వున్న రచయిత ఎస్.గణపతి రావు. గతంలో ‘మరిగే తారు సరోవరం‘ అన్న కథా సంపుటాన్ని వెలువరించింది ఈ రచయితే. తన నిబద్ధతకి, సమాజంలోని అసంబద్ధతకి నిలువుటద్దాలుగా నిలిచే మరికొన్ని కథలని ఈ ‘నిప్పుల తుఫాన్‘లో చేర్చారు. మంచి సమాజంకోసం ధైర్యవంతుల కథలు అని ముఖపత్రం మీదనే స్పష్టంగా ప్రకటించారు.

రోజూ వార్తాపత్రికల్లోనూ, టి.వి.ఛానళ్ళలోనూ ఎన్నో అమానవీయ సంఘటనలగురించి చదువుతాం. చదివిన కాస్సేపు ‘అయ్యో ‘ అనిపిస్తుంది. మళ్ళీ జీవనపోరాటంలో పడగానే మన సమస్యలే మనల్ని పూర్తిగా ఆవరిస్తాయి. అలాకాకుండా మెరుగైన సమాజంకోసమే అహరహం పరితపించే ఈ రచయిత తన కథల్లో వాస్తవాలని ఏమాత్రం సంకోచించకుండా యదాతథంగా మనముందు పెట్టారు. ‘ఇది తెలుసుకోవడం మన బాధ్యత కాదా? దీన్ని మార్చడం మన వంతుకాదా?‘ అని నిలదీసి ప్రశ్నిస్తారు. ఈ రచయిత స్వరం తీవ్రంగా ఉంటుంది. రచనా శైలిలో ఆ స్వరం ప్రతిధ్వనిస్తుంది. భారతదేశంలో అధికశాతం మందికి వృద్ధాప్యం శాపంలా మారిన పరిస్థితిని చిత్రిస్తూ ‘ఆత్మీయతలేని నిష్క్రమణల మాటేమిటి‘ అని నిలదీస్తారు 'చిట్టచివరి మెట్టు‘ అనే కథలో. . అవినీతిని ఆపే శక్తి అందరికీ లేకపోవచ్చు, కనీసం అవినీతి పరుల గుండెల్లో దడ పుట్టించలేమా? అని ఆలోచనలు రేకెత్తిస్తారు ‘తలకింద రైలు‘ అనే కథలో. ‘రంగుల తుళ్ళింత‘ అనే కథలో స్త్రీని పూర్తిస్థాయి వ్యాపారవస్తువుగా చిత్రిస్తున్న సమకాలీన చలనచిత్ర పరిశ్రమని ఎక్స్-రే తీసి చూపిస్తారు. సమాజంలో ఎక్కడ, ఏమూల చూస్తే గుండె చెదురుతుందో , ‘ఇదేమిటి..ఇలా ఎందుకు‘ అనిపిస్తుందో అన్ని కోణాలని స్పృశించారీ రచయిత. ప్రతి కథకీశీర్షిక క్రిందనే ఇచ్చిన క్లుప్త పరిచయాలు కూడా ఈ పుస్తకంలోని వైవిధ్యతకి ముందుగానే అద్దం పడతాయి. పునాదుల్లోంచి ప్రళయం, పాలబుగ్గలు, జాతి ఏమైంది, తలలూపే గడ్డిపరకలు - ఇలా కథలకి ఎంచుకున్న శీర్షికలే కాక పుస్తకం అలంకరణ కూడా వినూత్నంగా, ఆకర్షణీయంగా ఉంది. సమాజంలోని అవకతవకలగురించి ఏ కొంచెం ఆలోచించే అలవాటున్న పాఠకులైనా తప్పని సరిగా చదవాల్సిన పుస్తకం. మామూలు పాఠకులకి కూడా సాహిత్యం ద్వారా చైతన్యం రగిలించే ప్రక్రియ ఎలా ఉంటుందో తెలుస్తుంది ఈ కథలు చదువుతుంటే.

***

***Publishers:***
***S.Ganapathi Rao***
***Padgro Consultants(P) Ltd***
***12, Lady Madhavan Road***
***Chennai – 600 034***
***mtsbooks2011@yahoo.in***
***Dolphin_enter1@yahoo.com***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**